క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా శనివారం మండలంలోని పీచర, పార్పెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన

తానూరు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్ శివరాం అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం తాగి నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని.. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది గణేశ్ , గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జొన్న కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న గంగాచరణ్

కుభీర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ జొన్న పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో విక్రయించి మద్దతు ధర క్వింటాలుకు రూ.2970 పొందాలన్నారు. మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, పిరాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేశ్, సీఈవో క్రాంతికుమార్, విజయ్ ఉన్నారు.

అన్ని కులాలకు ఆర్థిక సాయం వర్తింపజేయాలి

ఖానాపూర్: రాష్ట్రంలో బీసీలకే కాకుండా అన్ని కులాల్లో చేతివృత్తుల వారికి ప్రభుత్వం షరతుల్లేకుండా ఆర్థికసాయం అందించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు మీసేవ కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న కౌన్సిలర్ దంపతులు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్ నాయిని స్రవంతి–సంతోష్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. కాలనీలోని గుమ్ముల రూప–రాజేందర్ దంపతులు సైతం 100 సిమెంట్ బస్తాలు ముందుకొచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సతీష్‌రావు దేశ్‌పాండే, ఎలిశెట్టి లింగేశ్వర్, పంబాల భీమన్న, అయిందాల జనార్దన్, భూమన్న, రవికాంత్, రాజేశ్వర్, శ్రీనివాస్, రవిచరణ్ తదితరులు ఉన్నారు.

'తొలిమెట్టు' పోస్టర్ ఆవిష్కరణ

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నోడల్ అధికారి డీఎల్ఎన్ చారి తొలిమెట్టు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు కనీస విద్యాసామర్థ్యాలు కలిగి ఉండేలా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న తెలంగాణ విద్యా దినోత్సవం నిర్వహించాలని అన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇద్దరు ఎస్సైలకు పదోన్నతులు

ఆసిఫాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఎస్సైలకు పదోన్నతులు కల్పిస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్సైలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు పొందారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమేశ్, నిర్మల్ వన్‌టౌన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎల్.వెంకటరమణకు సీఐగా పదోన్నతులు లభించాయి.

సన్మానం

లోకేశ్వరం: మండలంలోని రాజురకు చెందిన మధుసాయి ఇటీవల పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నాంపల్లిలో విజయమాధవి సేవా సంస్కృతి అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన నాట్య ప్రదర్శనలో నంది పురస్కారం అందుకున్నారు. శుక్రవారం రాజుర పంచాయతీ ఆవరణలో మధుసాయి ని సర్పంచ్ ముత్తగౌడ్ సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌రావు, మహేశ్, యశ్వంత్‌రావు, నవీన్, సాయన్న ఉన్నారు.

వానమ్మా.. నీ జాడేదమ్మా



లక్ష్మణచాంద: జూన్ మాసం సగం గడిచిపోయినా.. ఇప్పటికీ జిల్లాను తొలకరి వర్షం పలకరించలేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతుందని అధికారులు పేర్కొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏం చేయాలో తోచక వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడోనని ఆకాశం వైపు అన్నదాతలు దీనంగా చూస్తున్నారు.

- వానాకాలం ప్రారంభమైనా జాడలేని చినుకులు
- అదును దాటుతుందని నైరాశ్యంలో అన్నదాతలు
- ఆకాశం వైపు దీనంగా ఎదురుచూపు
- దంచి కొడుతున్న ఎండలు
- తొందరపడి విత్తుకోవద్దంటున్న వ్యవసాయాధికారులు



పొట్టపెల్లిలో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన దుక్కి

నిర్మల్ జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. తొలకరి వర్షాలు కురిస్తే విత్తనాలు విత్తుకునేందుకు భూములను సిద్ధం చేయడంతోపాటు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఇళ్ల వద్ద ఉంచుకున్నారు. వర్షాలు ఆలస్యమవుతుండటంతో పంట సమయం అదును దాటుతోందని రైతులు నైరాశ్యంలో ఉన్నారు. ఇప్పుడు ఆలస్యమైతే పంట చేతికి వచ్చే సమయంలో ఇబ్బంది అవుతుందని అన్నదాతలు వాపోతున్నారు.

జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో ఖరీఫ్(వానాకాలం)లో ప్రధాన పంట అయిన పత్తి లక్ష నుంచి లక్షా యాభై వేల ఎకరాల్లో, వరి లక్ష ఎకరాల్లో మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో, సోయాబీన్ లక్ష ఎకరాల్లో సాగు చేస్తారని ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ తెలిపారు. ఇప్పటికే కొందరు బోరు బావుల ద్వారా నీటి సౌకర్యం ఉన్న రైతులు పత్తి పంట 5 శాతం, మొక్కజొన్న 2 శాతం విత్తనాలు విత్తుకున్నారని పేర్కొన్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం ఇలా....

జూన్ మాసం ప్రారంభమై 15 రోజులు దాటినా జిల్లాలో చినుకు జాడలేదు. ఈసారి జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 79.6 మి.మీ నమోదవాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 11.0 మి.మీ మాత్రమే నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 68 మి.మీ వర్షపాతం తక్కువగా నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు.

భానుడి భగభగలు..

వర్షాల్లేక రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. దీంతో ఇంట్లోంచి బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. బోరు బావులున్న భూముల్లో కొన్నిచోట్ల మొక్కజొన్న విత్తనాలు వేశారు. కానీ పంటలను కాపాడుకునేందుకు రైతులు కష్టాలు పడుతున్నారు. నీటి సౌకర్యం లేని రైతులు వరుణుడిపైనే భారం వేసి ఎదురు చూస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

వానాకాలం సీజన్ ప్రారంభమై 15 రోజులు దాటినా వర్షాలు కురవలేదు. సోయాబీన్ వచ్చే నెల 15 వరకు విత్తుకోవచ్చు. నీటి సౌకర్యం ఉంటే మొక్కజొన్న విత్తనాలు వేసుకోవచ్చు. భారీ వర్షాలు కురిసే వరకు రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

నీళ్లు అందిస్తున్నాం



బావుల కింద ఉండటంతో రెండెకరాల్లో మొక్కజొన్న విత్తనాలు నాటాం. ప్రస్తుతం పంట రెండు ఆకుల దశలో ఉంది. ఎండలు ఉండటంతో నిత్యం కొడుకుతో కలిసి పంటకు బోరు ద్వారా నీటిని అందిస్తున్నాం.

– చిన్నవ్వ, బొప్పారం, మం.సోన్

పంట ఎండిపోయే ప్రమాదం



బోరుబావులు ఉండటంతో మొక్కజొన్న విత్తనాలు వేశాం. ప్రస్తుతం నీరు అందించడం కష్టమవుతుంది. వర్షం పడకుంటే మొలకెత్తిన పంట ఎండిపోయే ప్రమాదం ఉంది.

– ముత్యం, పీచర, మం.లక్ష్మణచాంద

దుక్కి సిద్ధం చేశాం



విత్తనాలు విత్తేందుకు నా చేనులో దుక్కి సిద్ధం చేసి ఉంచాను. వర్షాలు కురువగానే విత్తనాలు వేస్తాం. ఇప్పుడు ఆలస్యమైతే పంట చేతికివచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

– ముత్యం,ధర్మారం, మం.లక్ష్మణచాంద

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్, వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, కూడళ్లలో సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రగతి కింద ప్రత్యేక నిధులు కేటాయిస్తూ డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, పబ్లిక్ టాయ్‌లెట్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పలువురు మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం మహిళా సంఘాలకు మంజూరైన రూ.రెండు కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్ చైర్మన్ సుదర్శన్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు మురళీగౌడ్, పట్టణాధ్యక్షులు ఫారూక్, తోట రాము తదితరులున్నారు.

పోడు రైతులకు పట్టాలివ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

కడెం: పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఖానాపూర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా సాగు చేస్తున్నా.. హక్కు పత్రాల్లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అర్హులందరికీ పోడు పట్టాలు ఇవ్వకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం చంద్రన్న వర్గానికి చెందిన మాన్కు దేవన్న, రాజేశ్వర్, సత్తెన్న, మల్లక్క తదితరులు సీపీఐ(ఎంఎల్)న్యూడెక్రసీలో చేరారు. కార్యక్రమంలో హరిత, సునారికారి రాజేశ్, సర్దార్, విలాస్, వెంకటేశ్, గోపి, నర్సయ్య, ప్రసాద్, లింగన్న, స్వామి, గంగన్న తదితరులు ఉన్నారు.

మేదరి సంఘం జిల్లా కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం మేదరి (మహేంద్ర) సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు రాష్ట ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా సిరివేరి లక్ష్మీనర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఊరె దశరథ్, జిల్లా కోశాధికారిగా దూడ ప్రమోద్, జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎనుగందుల రాజేందర్, జిల్లా ఎన్నికల అధికారిగా మదిరె రామ్మోహన్‌ను జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎనుగందుల రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు మదిరె కష్ణమోహన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి మేదరులకు రూ.లక్ష సాయం సబ్సిడీ రుణాన్ని అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

రెండ్రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



యాకర్‌పెల్లిలో అదనపు కలెక్టర్ రాంబాబు పర్యటన

సారంగపూర్: రెండ్రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను ఎత్తివేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. మండలంలోని యాకర్‌పెల్లి, సారంగపూర్, కౌట్ల(డీ) గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తి చేశామని, మిగతా మూడు కేంద్రాల్లో పూర్తి చేసి ధాన్యం మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఆర్ఐ ముంతాజ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 17న శనివారం విద్యార్థులకు హరితోత్సవంపై పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 9వ, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అటవీశాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ హరితోత్సవం 'అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నియోజకవర్గాల వారీగా నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గం విద్యార్థులకు భైంసాలోని ఆశ్రమ పాఠశాలలో, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యార్థులకు నిర్మల్‌లోని సోఫీనగర్ గురుకుల పాఠశాలలో, ఖానాపూర్ నియోజకవర్గ విద్యార్థులకు మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తారని డీఈవో పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో పాల్గొనవచ్చని సూచించారు. నియోజకవర్గాల వారీగా, మాధ్యమాల వారీగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారని వివరించారు. విజేతలకు ఈనెల 19న నిర్వహించే తెలంగాణ హరితోత్సవం కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేస్తామన్నారు.

హరితోత్సవం విజయవంతం చేయాలి

కుంటాల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఈనెల 19న నిర్వహించే హరితోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కూలీలందరికీ పని కల్పించడంతోపాటు మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీవో రహీం, ఏపీఎం భోజన్న, ఏపీవో నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాదినోత్సవం విజయవంతం చేయండి

సారంగపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయజెండా ఆవిష్కరణ అనంతరం పాఠశాల భవనాలు, డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవాలతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించాలన్నారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి ఉన్నారు.

సుర్జాపూర్‌లో ఘనస్వాగతం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు భూక్య జాన్సన్‌కు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నరేందర్, శ్రావణ్, వెంకటేశ్వర్‌రావు, సంతోష్, రమేష్, ఎర్రన్న తదితరులు ఉన్నారు.

19 నుంచి గీతాజ్ఞాన యజ్ఞం

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో ఈనెల 19 నుంచి 4వ తేదీ వరకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 74వ గీతాజ్ఞాన యజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జితేందర్, కార్యదర్శి రాజేశ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గీతాసత్సంగం మెట్‌పల్లి వ్యవస్థాపక అధ్యక్షుడు చిలమంతుల చత్రపతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

భూమిపూజ

మామడ: మండలంలోని బండలఖానాపూర్‌లో ఉపాధి నిధులు రూ.20 లక్షలతో చేపట్టే పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఎంపీడీవో రమేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, గంగారెడ్డి, పాకాల చంద్రశేఖర్ గౌడ్, సర్పంచ్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంప్రదించాలి

ఖానాపూర్: పట్టణ పరిధిలో తలెత్తే విద్యుత్ సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజలు కింది నెంబర్లలో సంప్రదించాలని ఏఈ తిరుపతి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో 9491075583 నెంబర్‌తో పాటు, జేకే నగర్, రాజీవ్‌నగర్, విద్యానగర్, ఇంద్రానగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల వినియోగదారులు 83339 94287లో సంప్రదించాలన్నారు.హైటెక్‌సిటీ, సుభాష్‌నగర్, శివాజీనగర్, గాంధీనగర్, శాంతినగర్, అంబేద్కర్‌నగర్ వాసులు 83339 94288లో సంప్రదించాలని కోరారు.

నిధుల మంజూరుకు మంత్రి హామీ


లక్ష్మణచాంద: మండల కేంద్రంలో నిర్మించే అంబేద్కర్ భవన్ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరు చేయాలని అంబేద్కర్ సంఘం సభ్యులు మంత్రి ఐకేరెడ్డిని కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి అంబేద్కర్ సంఘ భవనానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం సభ్యులు తెలిపారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మండల ఇన్‌చార్జి అల్లో ల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	30
వంకాయ	60
బెండకాయ	60
పచ్చిమిర్చి	90
కాకరకాయ	70
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	120
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	30

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ఆదిపురుష్
నారాయణ : ఆదిపురుష్

ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాలులో ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషితో మున్సిపాలిటీలో భావితరాలకు మేలు జరిగేలా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత సెంట్రల్ లైటింగ్, రోడ్డు వైడింగ్, పట్టణపార్కు, వైకుంఠ ధామం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతిపై డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. అనంతరం మహిళా సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో స్త్రీనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో పలు రంగాల్లో రాణించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు జాతీయజెండా ఆవిష్కరించారు. కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కలీల్, రామునాయక్, పుప్పాల శంకర్, సుమన్, రాజగంగన్న, కిశోర్, ప్రదీప్, వెంకటప్పయ్య శ్రీనివాస్ ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం ఎమ్మెల్యే రేఖానాయక్ వంశీ నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట నాయకులు మహేందర్, గజేందర్, పుప్పాల శంకర్, రాజిరెడ్డి, చిన్నయ్య, మధు తదితరులు ఉన్నారు.

'దళితబంధు'కు కమీషన్ తీసుకుంటే ఊరుకోం'



దరఖాస్తులు అందిస్తున్న వినోద్ నాయక్

పెంబి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు సాయం అందించేందుకు నాయకులు, అధికారులు కమీషన్ తీసుకుంటే ఊరుకోబోమని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళితబంధు అప్లికేషన్ భరోసా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 110 మంది దళిత బంధు దరఖాస్తులను నింపి తహసీల్దార్ కార్యాలయంలో అందించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, శంకర్, స్వామి, సుభాష్, వసంత్, భీంరావ్, రాజన్న, భీంరావు, నాగరాజు, సలీం ఉన్నారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు



ఖాళీగా తహసీల్దార్ కుర్చీ

పెంబి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కుల, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే బీసీలకు ఇబ్బందులు తప్పడం లేదు. తహసీల్దార్ శ్రీధర్ సోమవారం నుంచి కార్యాలయానికి రావడం లేదు. సిబ్బందిని అడిగితే సెలవులో ఉన్నారని సమాధానమిచ్చారు. మరోవైపు ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు ఆర్థికసాయం కోసం దరఖాస్తుకు ఈనెల 20 గడువు తేదీ. దీంతో లబ్ధిదారులు ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై మాట్లాడేందుకు ఆర్డీవోకు ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేదు.

ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీ బాపురావ్‌తో సర్పంచులు, ఎంపీటీసీలు

కుంటాల: నియోజకవర్గంలోని ముధోల్, భైంసా, కుంటాల మండలంలోని బీజేపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీ సోయం బాపురావ్‌ను ఆదిలాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఎంపీ నిధుల నుంచి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఎంపీటీసీలు కట్ట రవి, భూమేశ్, కోటగిరి పోశెట్టి, సర్పంచ్‌లు చంద్రకాంత్‌పటేల్, లక్ష్మణ్‌పటేల్ తదితరులున్నారు.

లోకేశ్వరం: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎంపీ సోయం బాపురావ్‌ను మండలంలోని రాయపూర్ కాండ్లీ గ్రామస్తులు శుక్రవారం కలిశారు. పిప్రి ఎత్తిపోతల పథకం నుంచి రాయపూర్‌కాండ్లీ శివారు చివరి ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. గ్రామంలో రోడ్డు, మురికి కాలువలు, సీసీ రోడ్లు తదితర అంశాలపై ఎంపీకి విన్నవించారు. నాయకులు నారాయణ్‌రెడ్డి, భూమన్న, వెంకట్ ఉన్నారు.